కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

సికింద్రాబాద్ అభ్యర్థి దానం


సమావేశంలో మాట్లాడుతున్న దానం నాగేందర్

సనత్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని ఆ పార్టీ సికింద్రాబాద్ అభ్యర్థి దానం నాగేందర్ పిలుపునిచ్చారు. బేగంపేటలోని పైగా ప్యాలెస్‌లో సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీల స్థాయి విస్తృత సమావేశం గురువారం జరిగింది. సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి హాజరైన దానం నాగేందర్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేపీలో కలుస్తారనే విష ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అమలుచేస్తున్న గ్యారెంటీలతో ప్రభుత్వానికి మంచి గుర్తింపు వచ్చిందన్నారు. సనత్‌నగర్ రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రతి బూత్‌లోనూ మెజార్టీ సాధించేలా బూత్ కమిటీలు అంకితభావంతో పనిచేయాలన్నారు. అలాగే రాష్ట్రంలో అమలవుతున్న పథకాల గురించి అందరికీ తెలియజేసి కాంగ్రెస్ పార్టీ మాటపై నిలబడే పార్టీగా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కోట నీలిమ మాట్లాడుతూ.. సనత్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మంచి మెజార్టీ చూపిస్తామని మహిళా శక్తి కాంగ్రెస్ వెంటే ఉందన్నారు. సీనియర్ నేత ఫిరోజ్‌ఖాన్ మాట్లాడతూ.. బూత్ కమిటీలు పార్టీకి అమ్మలాంటిదని బూత్ కమిటీల్లోని కార్యకర్తలే పార్టీకి నిజమైన కార్యకర్తలన్నారు. విజయారెడ్డి మాట్లాడుతూ.. మరో 20 రోజులు కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే ప్రజల జీవితాలు మా జుజీతాయన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ రవీందర్‌గౌడ్, రోహిత్, నాగేందర్‌రాజ్, నరేష్, శ్రీనివాసరావు, అమనుల్లాఖాన్, మల్లికార్జున్, చిరంజీవి పాల్గొన్నారు.

ఎండ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న గాంధీ వైద్యులు

గాంధీఆస్పత్రి : రోజురోజుకు పెరుగుతున్న ఎండలతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని గాంధీ సూపరింటెండెంట్ రాజారావు సూచించారు. కుటుంబ సంక్షేమశాఖ ఆదేశాల మేరకు గురువారం గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో చైతన్యర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీపీ, షుగర్, హృద్రోగులు, దీర్ఘకాల వ్యాధులతో బాధ పడేవారు, బాలింతలు, గృహిణులు, చిన్నారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎండ తగలకుండా టోపీ, గొడుగు, టవల్ వినియోగించాలని కాటన్ దుస్తులు ధరించాలి, బయటకు వెళ్లేటప్పుడు నీరు వెంట తీసుకెళ్లాన్నారు. చెవుల్లోకి వేడిగాలి వెళ్లకుండా చూసుకోవాలని వడదెబ్బకు గురైన వారికి ఓఆర్ఎస్ తాగించాలన్నారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల లోపు బయటకు రాకూదని, నల్లటి దుస్తులు ధరించరాదన్నారు. గాంధీ ఓపీ, అత్యవసర, మాతాశిశు సంరక్షణ బ్లాక్, పేషెంట్ వెయిటింగ్ షెడ్ తదితర ప్రాంతాల్లో అవగాహన కల్పించి, కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డెర్మటాలజీ హెచ్‌ఓడీ నర్సింహరావునేత, ఆర్ఎంఓ–1 జయకృష్ణ, కుటుంబ సంక్షేమ అధికారి వెంకటరామనర్సయ్య పాల్గొన్నారు.

సాంకేతిక విద్యకు నైపుణ్యతే కొలమానం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న వీసీ రవీందర్

ఉస్మానియా యూనివర్సిటీ: సాంకేతిక విద్యకు నైపుణ్యం, సృజనాత్మకతే కొలమానమని ఓయూ వీసీ ప్రొ.రవీందర్ అన్నారు. గురువారం యూనివర్సిటీ క్యాంపస్ టెక్నాలజీ కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై టెక్నోస్మానియా–2024ను ప్రారంభించి మాట్లాడారు. ఓయూ క్యాంపస్‌లో ఇంజినీరింగ్, టెక్నాలజీ కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఉద్యోగాల కొదవలేదని ఇక్కడ చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నత ఉద్యోగాలను సాధిస్తున్నారన్నారు. తాజాగా వెలువడిన సివిల్స్ ఫలితాల్లో ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం 2020 బ్యాచ్ విద్యార్థి మెరుగు కౌశిక్‌కు జాతీయ స్థాయిలో 82వ ర్యాంక్ సాధించడం గొప్ప విశేషమన్నారు. హైదరాబాద్, బెంగళూర్ మొదలు అమెరికాలోని సిలికాన్ వ్యాలీ వరకు ఓయూ ఇంజినీరింగ్ విద్యార్థులే కనిపిస్తున్నారన్నారు. స్వతహాగా కార్య నిర్వహణ సామర్థ్యం మెరుగు పరుచుకునేందుకు (మేనేజ్‌మెంట్ స్కిల్స్) ఏడు కోర్సుల విభాగాల విద్యార్థులే జాతీయ స్థాయిలో టెక్నోస్మానియా సదస్సును నిర్వహిస్తారని ప్రిన్సిపల్ ప్రొ.చింత సాయిలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ శ్రీనునాయక్, అధ్యాపకులు, విద్యార్థి కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

స్వామివారి కొబ్బరికాయలకు డిమాండ్

వేలంపాటలో రూ. లక్ష ఆదాయం


కొబ్బరికాయను భక్తురాలికి అందిస్తున్న వేదపండితుడు

చిలకలగూడ : శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవ పీఠంపై ఉంచిన కొబ్బరి కాయలకు భక్తుల నుంచి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. కొబ్బరికాయలను సొంతం చేసుకునేందుకు పోటీ పడ్డారు. పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించిన వారణాయనవనం ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఐదు కొబ్బరికాయలకు వేలం వేయగా రూ. లక్ష ఆదాయం సమకూరింది. డాక్టర్ రజనీ రూ. 32 వేలు, సీతారామశాస్త్రి రూ.21 వేలు, జీఎస్ రమేష్ రూ.15 వేలు, కోటేశ్వరరావు రూ.16 వేలు, ఆనంది రూ.16 వేలకు వేర్వేరుగా ఐదు కొబ్బరి కాయలను వేలంపాట ద్వారా సొంతం చేసుకున్నారు.

ఉప ఎన్నికకు తొలి రోజు నామినేషన్లు నిల్




కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. తొలిరోజు ఎలాంటి నామినేషన్‌లు దాఖలు కాలేదు. ప్రధాన పార్టీలతో పాటు ఇతర పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులు శుక్రవారం నామినేషన్ వేసే అవకాశముంది. తొలి రోజు 15 నామినేషన్ పత్రాలు విక్రయించినట్లు అధికారులు వెల్లడించారు. నామినేషన్‌ల ప్రక్రియ కోసం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం ఆవరణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం నుంచి సికింద్రాబాద్ కోర్టుల సముదాయం, నార్త్‌జోన్ డీసీపీ కార్యాలయానికి వెళ్లే మార్గాలను సైతం మూసేశారు. కంటోన్మెంట్ బోర్డు కార్యాలయ సందర్శకులను సైతం నిర్ణీత సమయం (మధ్యాహ్నం 3.00 గంటలు) తర్వాత మాత్రమే అనుమతిస్తున్నారు.

శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ల చేతివాటం?

అమీర్‌పేట: రోడ్లు, కాలనీ బస్తీలో ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాల్సిన శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్లు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి చిన్నా చితక వ్యాపారాలు చేసే వారిని టార్గెట్‌గా చేసుకుని నెల నెల మామూళ్లు దండుకుంటున్నారని బహిరంగానే చర్చించుకుంటున్నారు. అయితే.. ఈ తతంగం అంతా అధికారులు కనుసన్నల్లోనే నడుస్తున్నట్లు తెలుస్తోంది.పారిశుద్ధ్య కార్మికులను సమన్వయం చేసుకుని పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాల్సిన ముగ్గురు శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్స్ ఇష్టానుసారంగా వసూళ్లకు పాల్పడుతున్నారని బీకేగూడకు చెందిన ఓ పాన్ షాపు యజమాని, మరో బియ్యం దుకాణం నిర్వాహకుడు వాపోయారు. ఏరియాతో సంబంధం లేకుండా అమీర్‌పేట, బల్కంపేట, సనత్‌నగర్ ఎస్ఆర్‌టీ, బీకేగూడ, మైత్రీవనమ్, సత్యం థియేటర్ పరిసరాల్లో ఉన్న ఏ ఒక్క వ్యాపారిని కూడా వదలడం లేదు.ఫుడ్,ట్రైడ్ లైసెన్సుల పేర్లతో వేలల్లో డబ్బులు దండుకుంటున్నారని ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఫాస్ట్ ఫుడ్ స్టాల్ నడిపే యువకుడు వాపోయాడు.డబ్బులు ఇవ్వకపోతే స్టాల్ మూసి వేయిస్తామని బెదిరిస్తుండడంతో చేసేదేమీ లేక అడిగినంత సమర్పించుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశాడు. పారిశుద్ధ్య కార్మికులను సైతం వీరు వేధిస్తున్నట్లు సమాచారం .ప్రమాదవశాత్తు లేదా అనారోగ్య కారణంగా ఎవరైనా చనిపోతే వారి స్థానంలో కుటుంబ సభ్యులను ఉద్యోగంలో పెట్టిస్తానని చెప్పి లక్షల్లో డబ్బులు తీసుకుని వేరే వ్యక్తులను పెట్టుకున్నారన్న ఆరోపణలు వీరిపై ఉన్నాయి. మామూళ్ల మత్తులో పారిశుద్ధ్య నిర్వహణను అసలు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు అధికారుల పాత్ర కూడా ఉండటంతో వారి ఆగడాలకు అంతులేకుండా పోతున్నాయని కొందరు బాధితులు లబోదిబోమంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాలేయం.. నువ్వే బలం!




- చెడును దాచుకుని.. మంచిని పంచుతుంది
- స్వీయ చికిత్స చేసుకునే ఏకైక అవయవం ఇదే
- ఆరోగ్య లెవల్స్ పెంచేందుకు దోహదం
- 60 శాతం మందిలో ఫ్యాటీలివర్
- ప్రాథమికదశలో గుర్తిస్తే నియంత్రణ సులభం
- నేడు వరల్డ్ లివర్ డే

గాంధీఆస్పత్రి: నోటి నుంచి తీసుకునే అన్నిరకాల పదార్థాలకు సంబంధించిన మంచి, చెడులను తనలోకి తీసుకుని, మంచిని మాత్రమే శరీర భాగాలకు అందించి చెడును తనలోనే దాచుకుని, తనుకు తానుగా చికిత్స చేసుకునే అత్యద్భుత మానవ శరీర అవయం కాలేయం. విటమిన్లు, ఖనిజాలు, ఐరన్ వంటి పోషకాలను తనలో దాచుకుని అవసరమైనప్పుడు ఇతర అవయవాలకు అందించి, వైరస్, బాక్టీరియాలతో పాటు విష తుల్యాలను తొలగించి, జీర్ణప్రక్రియలో పెద్దన్న పాత్ర పోషిస్తోంది. ప్రస్తుత మానవ జీవనశైలి, ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం, మద్యం, మత్తు పదార్థాల సేవనంతో కాలేయ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. రాష్ట్రంలో 60 శాతం మందిలో ఫ్యాటీలివర్ ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కాలేయ సంబంధ సమస్యలపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రతిఏటా ఏప్రిల్ 19వ తేదీన ప్రపంచ కాలేయ దినోత్సవాన్ని నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. కాలేయ సంబంధ రుగ్మతలు, సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గాంధీ గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రవణ్‌కుమార్‌తో సాక్షి ముచ్చటించింది.

- మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లతో కాలేయ సంబంధ సమస్యలు ఎక్కువగా ఉత్పన్నమవుతున్నాయి. క్రానిక్ లివర్ డిసీజెస్, సిరోసిస్, హెపటైటిస్ ఇన్ఫెక్షన్లు బారిన పడుతున్నారు. 60 శాతం నాన్ ఆల్కాహలిక్ స్టెయిటో హెపటైటిస్ (నాష్) ఫ్యాటీలివర్ కేసులు నమోదవుతున్నాయి.
- లివర్‌కు రీ జనరేటింగ్ కెపాసిటీ (తనకు తానుగా చికిత్స చేసుకునే తత్వం) ఉంది. కాలేయం 60 శాతం పాడైన వరకు లక్షణాలు బయట పడవు. వ్యాధి బాగా ముదిరిన తర్వాత కడుపులో ఉబ్బరం, గ్యాస్టిక్, చర్మ, కళ్లు పసుపుపచ్చగా మారడం (జాండిస్), మూత్రం రంగు మారడం, కాళ్లవాపులు, కండరాల క్షీణత, పొట్టలో నీరు చేరడం ఇలా ఒక్కోటిగా లక్షణాలు బయటపడి ప్రాణాంతకం అవుతుంది.
- ఉబకాయం, షుగర్ ఉన్నవాళ్లు మరింత జాగ్రత్తగా ఉండాలి. సమతుల్య ఆహారం తీసుకోవాలి. మానసిక ఒత్తిడి తగ్గించుకుని, యోగా, వాకింగ్, శారీరక వ్యాయామాలు చేయాలి, ఇటీవల నాన్ వెజిటేరియన్ల సంఖ్య 25 శాతం పెరిగినట్లు సర్వేల ద్వారా తేలింది. మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.
- స్వీయ చికిత్స చేసుకునే సామర్థ్యం ఉన్న కాలేయాన్ని కాపాడుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతమైన జీవనం సొంతం అవుతుంది. శరీరంలోని ప్రతి అవయవంపై తనదైన ముద్ర వేసిన కరోనా వైరస్ కాలేయంపై ఎలాంటి ప్రభావం చూపించకపోవడం గమనార్హం. కాలేయం పూర్తిగా పాడైతే లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఒక్కటే ప్రత్యామ్నాయం.
- గాంధీ ఆస్పత్రిలో అత్యాధునిక ఫైబ్రోస్కానింగ్ అందుబాటులో ఉంది. ప్రతి బుధవారం స్కానింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారు. బుధ, శనివారాల్లో గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ విభాగం పని చేస్తోంది. అత్యాధునిక వైద్య యంత్రాలు, నిష్ణాతులైన వైద్యులు అందుబాటులో ఉన్నారు.
- వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఈ ఏడాది 'బీ వెజిలెంట్, డూ రెగ్యులర్ లీవర్ చెక్‌అప్, ఫ్యాటీ లీవర్ కెన్ ఎఫెక్ట్ ఎనీవన్' 'కీప్ యువర్ లివర్ హెల్తీ అండ్ డిసీజ్ ఫ్రీ' అనే నినాదంలో పలు అవగాహన, చైతన్య కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించింది.

40 ఏళ్లు దాటితే పరీక్ష తప్పనిసరి..



ప్రారంభ దశలోనే గుర్తించి సరైన వైద్యం అందిస్తే కాలేయం పనితీరు, సామర్థ్యం బాగుంటుంది. 40 ఏళ్ల వయసు పైబడినవారు ఆరునెలలకు ఓ సారి కాలేయ సామర్థ్య పరీక్షలతో పాటు, అల్ట్రా సౌండ్, సీటీ, ఎమ్మారై, లీవర్ ఫంక్షన్ టెస్ట్ (ఎల్ఎఫ్‌టీ) టెస్టులు చేయించుకోవాలి. అత్యాధునిక ఫైబ్రోస్కానింగ్ అందుబాటులోకి వచ్చింది. ఈ పరీక్షలో ఫ్యాటీ లీవర్ పర్సంటేజీతో పాటు లీవర్ ఎంత భద్రంగా ఉందో స్పష్టంగా తెలుస్తోంది.

–ప్రొ. శ్రవణ్‌కుమార్, గాంధీ గ్యాస్ట్రోఎంట్రాలజీ హెచ్‌ఓడీ

గాంధీలో విజయవంతంగా లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్



సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో రూ. 35 కోట్లతో అవయవ మార్పిడి కోసం నిర్మిస్తున్న అత్యాధునిక మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు మరో ఆరునెలల్లో అందుబాటులోకి తెస్తాం. కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నాం. అత్యవసర విభాగంలో లీవర్ ఇన్సెంటివ్ కేర్ యూనిట్ (ఎల్ఐసీయూ) అందుబాటులోకి తెచ్చాం. కాలేయ సంబంధ రుగ్మతలతో బాధపడుతున్న వేలాది మంది నిరుపేద రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం.

– ప్రొ.రాజారావు, సూపరింటెండెంట్

నేడు ఎన్ఐఎన్‌లో మహనీయుల జయంతి

లాలాపేట: తార్నాకలోని జాతీయ పోషకాహార సంస్థ(ఎన్ఐఎన్)లో శుక్రవారం మహనీయులైన డా. అంబేడ్కర్, డా. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు లక్ష్మణ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు అసెంబ్లీ హాల్లో జరిగే ఈ వేడుకలకు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం, ఎన్ఐఎన్ డైరెక్టర్ డా. హేమల హాజరవుతారన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 35, పందిరి బీర 45, క్యాబేజీ 19, క్యారెట్ 33, దొండ 23, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 25, దోసకాయ 16, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 19, ఆలుగడ్డ 33, చామగడ్డ 35, మొరంగడ్డ 19, కందగడ్డ 65, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5.

శుభాకాంక్షలు



లాలాపేట: టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా నియమితులైన పొన్నం అశోక్‌గౌడ్, ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరీను గురువారం గాంధీ భవన్‌లో తార్నాక డివిజన్ లాలాపేటకు చెందిన టీపీసీసీ కార్యదర్శి ఎస్ఎల్ శ్రీనివాసులు గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం


చిట్యాల రాజు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని సైఫాబాద్ పీజీ కాలేజీ కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు, సూర్యాపేట వాసి చిట్యాల రాజుకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ఓయూ అనుబంధ ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీ అధ్యాపకులు డాక్టర్.ఏవీ కృష్ణప్రసాద్ పర్యవేక్షణలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ నెట్‌వర్క్‌కు అనుసంధానమయ్యే వివిధ రకాల స్మార్ట్ డివైజెస్‌ల అథెంటికేషన్, డాటా సెక్యూరిటీ అంశంలో ఎదురవుతున్న సవాళ్లను మెషిన్ లర్నింగ్ సహాయంతో ఎలా అధిగమించవచ్చు అనే అంశం పై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది.

ఆదరించండి అభివృద్ధి చేస్తా: నివేదిత


ప్రచారంలో పాల్గొన్న నివేదిత

రసూల్‌పురా: కంటోన్మెంట్‌లో జరగబోయే ఉప ఎన్నికల్లో తనను ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆమె నియోజకవర్గం రెండవ వార్డు అన్నానగర్, అర్జున్‌నగర్‌ర్ బస్తీల్లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్. శ్రీనివాస్, రావుల శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నివేదిత మాట్లాడుతూ.. ప్రజల మద్దతుతో తన తండ్రి దివంగత ఎమ్మెల్యే సాయన్న ఐదుసార్లు గెలిచి పేదల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేశారని గుర్తుచేశారు. ఉప ఎన్నికల్లో కంటోన్మెంట్‌లో గులాబీ జెండా ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరు కారు గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. నివేదిత ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఆకుల రూప, మాధురి, స్థానిక నేతలు అంజనేయులు, జిలానీ, రఘురామన్, శ్యామ్, శ్యామ్ రెడ్డి, దేవులపల్లి శ్రీనివాస్, నర్సింహా, ప్రకాష్, కుమార్ పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి ప్రాధాన్యం : ఈటల


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

కంటోన్మెంట్: ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశాన్ని కాపాడే బాధ్యతలు నిర్వర్తించిన మాజీ సైనికుల సంక్షేమానికి బీజేపీ అధిక ప్రాధాన్యం ఇస్తుందని బీజేపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందన్నారు. సిఖ్ విలేజ్ జ్యువెల్ గార్డెన్స్‌లో నిర్వహించిన మాజీ సైనికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం హయాంలోనే కంటోన్మెంట్‌లలో అభివృద్ధి పెరిగిందన్నారు. ఆర్మీలో పనిచేసేందుకు యువతలో మక్కువ పెరుగుతుందన్నారు. హైదరాబాద్‌లో ఎకరం రూ.100 కోట్లకు పోతుందని కేసీఆర్ గర్వంగా చెప్పుకుంటున్నారని, మాజీ సైనికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడం ఎంత వరకు సబబు అన్నారు. తాను ఎంపీగా గెలిచాక ఆర్మీ హౌజింగ్ సొసైటీలకు ఇళ్ల స్థలాలు ఇప్పించే ప్రయత్నం చేస్తానన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే రాహుల్ గాంధీ ప్రధాని అవుతాడని చెబుతున్నారని, ఇది సాధ్యం అయ్యేది లేదన్నారు. వర్షం కారణంగా కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రాకపోవడం బాధాకరం అన్నారు. స్థానిక పోలీసుల ఆంక్షల వల్ల చాలా మంది సమావేశానికి రాలేకపోయారని అన్నారు.

జీవో నెం.55 అమలు చేయాలి..

మాజీ సైనిక ఉద్యోగుల సంఘం నేత రిటైర్డ్ కల్నల్ డాక్టర్. ఎస్. శ్రీనివాస రావు మాట్లాడుతూ మాజీ సైనిక ఉద్యోగులకు కేంద్రం కల్పించిన 2 శాతం రిజర్వేషన్ తెలంగాణలో అమలు కావడం లేదన్నారు. కేంద్రం ఆమోదించిన జీవో నెం.55ను తెలంగాణలో అమలు చేయాలన్నారు. దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మేజర్ జనరల్ (రిటైర్డ్) ఏ. శ్రీనివాస రావు, వింగ్ కమాండర్ (రిటైర్డ్) టి. జే. రెడ్డి, బ్రిగేడియర్ (రిటైర్డ్) డాక్టర్ టి. రామయ్య, వెటరన్ ఎల్. జగన్ రెడ్డి, వెటరన్ గోపు రమణా రెడ్డి, బీజేపీ నేతలు మల్లారెడ్డి, రామకృష్ణ, శ్యామ్ సుందర్ గౌడ్, వంశ తిలక్, భానుక మల్లికార్జున్ పాల్గొన్నారు.

పరామర్శించేందుకు వెళ్తూ మృత్యు ఒడికి..

రైలెక్కుతూ జారిపడి వ్యక్తి మృతి


మృతిచెందిన సోమేశ్వర్‌రావు

సికింద్రాబాద్: మృతి చెందిన బంధువుకు కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తూ రైలు నుంచి జారిపడి వ్యక్తి ఓ మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వేపోలీసుల కథనం ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన బి.సోమేశ్వర్‌రావు (55) 15 ఏళ్ల క్రితం ఉపాధి కోసం నగరానికి వచ్చి పటాన్ చెరు సమీపంలోని ముత్తంగిలో భార్యాపిల్లలతో కలిసి ఉంటూ ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఒడిస్సాలో బంధువు చనిపోయినట్టు సమాచారం రావడంతో పరామర్శించి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి గురువారం ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ చేరుకుని ఈస్ట్‌కోస్ట్ రైలు ఎక్కేందుకు ప్రయతించే క్రమంలో జారి పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఎడమ కాలు మొత్తంగా తెగి పోయింది. ప్రమాదాన్ని గుర్తించిన పోలీసులు క్షతగాత్రుడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా కొన్ని గంటల పాటు చికిత్స పొంది మృతి చెందాడు.

మోత్కుపల్లిది న్యాయమైన పోరాటమే

వీహెచ్ హన్మంత్‌రావు


దీక్షకు మద్దతు తెలిపిన వీహెచ్

అమీర్‌పేట: మోత్కుపల్లి నర్సింహులు చేస్తున్న పోరాటం న్యాయమైనదేనని మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ హన్మంత్ రావు అన్నారు. మాదిగలకు ఎంపీ టికెట్లు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ మోత్కుపల్లి నివాసంలో చేపట్టిన దీక్షకు వీహెచ్ మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీకి కట్టుబడి ఉంటూనే తన జాతి కోసం పోరాటం చేయడం మంచిదే అన్నారు. రాష్ట్రంలో 17 పార్లమెంట్ సీట్లు ఉండగా మాదిగల్లో ఒక్కరిని కూడా పోటీకి దింపక పోవడం ఆలోచింపదగ్గ విషయమని మాజీ ఎంపీ సర్వే సత్యనారాయణ పేర్కొన్నారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు, దళిత సంఘాలను చెందిన ప్రసాద్, సురేందర్ దీక్షకు మద్దత్తు ప్రకటించారు.

కాంగ్రెస్ గెలిస్తేనే అభివృద్ధి


రెజిమెంటల్‌బజార్‌లో ప్రచారం చేస్తున్న శ్రీగణేష్

రాంగోపాల్‌పేట్: కంటోన్మెంట్ నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుతోనే నియోజకవర్గంలో అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ అభ్యర్థి శ్రీ గణేష్ అన్నారు. గురువారం ఆయన పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి రెజిమెంటల్‌బజార్ మదర్ థెరీసా విగ్రహం నుంచి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థినైన తనను గెలిపిస్తే నిధులు కేటాయింపులు చేపట్టి ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని అన్నారు. ఇన్ని రోజులుగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉండగా ఎక్కడ సమస్యలు పరిష్కారం కాలేదని, రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయన్నారు. పార్టీలకు సంబంధం లేకుండా గత కొన్ని సంవత్సరాల నుంచి శ్రీ గణేష్ ఫౌండేషన్ ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నానని అలాగే మల్కాజ్‌గిరి పార్లమెంటు అభ్యర్థిగా సునితా మహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రచారంలో అల్లాడి గౌరిశంకర్, బద్రీనాథ్ యాదవ్, నందికంటి రవి, శ్రీనాథ్, శ్రవణ్ పాల్గొన్నారు.

కనుల పండువగా రాములవారి కల్యాణం


కల్యాణోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం రాత్రి జరిగిన సీతారాముల ఎదుర్కోలు ఘట్టం మొదలు తలంబ్రాలు వరకు ఆద్యంతం కనుల పండువగా జరిగింది. ఆలయ చైర్మన్ నోముల ప్రకాశ్‌రావు నేతృత్వంలో నిర్వహించిన కల్యాణోత్సవానికి సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ హాజరయ్యారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

శ్రీరామ పట్టాభిషేకం


శ్రీరామ పట్టాభిషేక మహోత్సవ దృశ్యం

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. హనుమాన్, లక్ష్మణ సమేత సీతారాముల ఉత్సవ విగ్రహాలకు పట్టువస్త్రాలతో అలంకరించి, మేళా తాళాలు, భాజాభజంత్రీలు, వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ రాముడి పట్టాభిషేకం జరిగింది. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, ఈఓ రాజేష్‌కుమార్ ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ ఉపాధ్యక్షుడు వేణుగోపాలరావు, ఆలయ కమిటీ సభ్యులు బాలభాస్కర్, ఆత్మరామ సూర్యసుబ్రహ్మణ్యం, నారాయణన్, శివశంకరన్, రామచందర్ పాల్గొన్నారు.

నేడు రేపు జాతీయ సదస్సు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నేడు, రేపు (19, 20న) జాతీయ సదస్సు జరగనుంది. భౌతిక, గణిత శాస్త్రాలలో ఇటీవల పురోగతులు అనే అంశంపై సదస్సుకు ముఖ్యఅతిథులు ఏపీ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ జేడీ డాక్టర్. పి బాబుతో పాటు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్ర వెంకటేశం, ఉన్నత విద్య మండలి ఛైర్మన్ ప్రొ.లింబాద్రి హాజరైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.సుకన్య తెలిపారు. అనంతరం సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.అనితా అబ్రహం, డా.బంగ్లా భారతీ, ఎస్ నిర్మల, సదస్సు కన్వీనర్లు డా.చిన్నబాబు, డా.మల్లేశ్వరీ, సహ కన్వీనర్లు విజయ నిర్మల, ఎల్ విష్ణుప్రియ పాల్గొన్నారు.